# చర్మాల రంగు భేదాల బాధలు

సుదర్శనసేన్, బిమలా, నేనూ జూ చూడ్డానికని బయలుదేరేం. సోమసుందర్ ఆంధ్రా ఎసోసియేషన్ మీటింగెదో వుంటే దానికని వెళ్ళాడు, చిత్తరంజన్ ఎవెన్యూకి.

"మీరు బొటానికల్ గార్డెన్స్ చూశారా?" సుదర్శనసేన్ అడుగుతున్నాడు. "అక్కడ ప్రపంచంలోకల్లా పెద్ద మఱ్ఱిచెట్టు వుంది. చాలా చదరపుగజాల ఆవరణాక్రమిస్తూ."

"చూళ్ళేదు, రేపు చూస్తాను" అన్నాను.

ఎక్స్ప్లనేడ్ చేరుకుంటున్నాం. పక్కనే ఇండియన్ కాఫీహౌస్ కనిపించింది. ప్రాణం లేచివొచ్చినట్టయింది. వెధవ టీతో నాలుగు రోజుల్నించి విసిగి పోతున్నాను.

"మిష్టర్! ఒక కప్పు కాఫీ తాగాలి" అన్నాను.

నా దిగాలుపడిన మొఖం, నే నో'కాఫీజీవి'నని అడక్కుండానే చెబుతోంది. వాళ్లు 'చా'వాలాలైనా, స్నేహంకోసం అనుసరించారు.

ఎక్స్ప్లనేడ్‌లో కిదర్‌పూర్ రోడ్‌కి పోయే ట్రాం ఎక్కా.

నేను ప్రతీ చిన్న బిల్డింగ్‌నీ పోగొట్టుకోకండా చూస్తున్నాను. అన్నీ చూడ్డానికి నాకు సావకాశమిస్తున్నా, సుదర్శనసేన్ మధ్యమధ్య 'శాంతినికేతన్'ని గురించి లెక్చరు దంచుతున్నాడు.

ఇంతట్లో నా ఎదురుగా కూచున్న బిమల నాదృష్టి నాకర్షించింది. ఆమెని 'అబ్‌జర్వ్' చేస్తున్నాను. ఆమె జుట్టువెనకాలనించి భవనాలు, మరికొన్ని ట్రాంలు, లారీలు వెనక్కి పరుగెడుతున్నాయి.

నా పక్కని కూచున్న బ్రిటిష్ సోల్జర్‌ని తెగ పరికిస్తోంది, ఎవరితోనూ మాట్లాడకుండా. అంత గొప్ప అందమేముందా? అని అతన్ని చూశాను. చక్కగానే వున్నాడు, యూనిఫారంలో. నోటిని మాత్రం నల్లని పైపొకటి ఎంగేజ్ చేస్తోంది.

సుదర్శన్ అన్నాడు "కాళీఘాట్ చూస్తావా?" అని.

"అట్లానే" నని తలూపి, బిమల చిత్తప్రవృత్తిని అవలోకించడంలో పడ్డాను.

సోల్జర్ వీటి కన్నిటికీ అతీతమైనట్టు ధూమపానంలో పడ్డాడు. బిమల అతని నిర్లక్ష్యాన్ని లెక్కచెయ్యకుండా చూస్తోంది; అతని అందాన్ని త్రాగుతున్నట్టు.

నాకు ఈర్ష్య కలగలేదు గాని, అదేదో భావం కలిగింది, సరిగా నిర్వచించలేనిది.

కాళీఘాట్‌లో ముగ్గురం దిగాం; దేవాలయం చూద్దామని. ఏమంత గొప్పగా లేదు. అనవుసర మనిపించింది.

ఆమాట ముందరే ఎప్పుడో అన్నాడు సుదర్శన్. కాని "కలకత్తా కాళికనాలుక కావాలోయ్... నవ కవానికి" అన్న శ్రీశ్రీ మాట "నడు. తప్పకుండా చూడాలి" అని చెయ్యి పట్టుకుని నడిపించింది.

తీరా చూశాను కదా, ఎవరో మూఢజనం, ఆడవాళ్లు తడిబట్టలలోనూ కన్పించారు. కోటిపల్లి తీర్థాలలోని నీచత్వమే ఇక్కడా కనిపించింది.

"శ్రీశ్రీ ఏదో వుదహరిస్తే నన్ను చూడమని ఎవరన్నారు?"

శ్రీశ్రీని, నన్ను సమర్థించు కుంటున్నాను!!

ఈసారి ట్రాంలో మా ఎదురుగా ఎవరో నీగ్రోమనిషి కూచున్నాడు. బిమల, సుదర్శన్ పక్కగా కూచుంది. నేను నీగ్రోని అతని సాంప్రదాయాలు తెల్సుకుందామన్నట్టు పరిశీలించి చూస్తున్నాను. మనకంటె, అన్నివిధాల అనాగరీకుడైనా, మన బానిసత్వం అట్లాంటి వాళ్ళని ద్వేషించకుండా వుండడం నేర్పింది మనకి!

"ఆ బిరుసు వుంగరాలజుట్టు, బొద్దింక పెదవులూ..." ఏదో వర్ణన తడుతోంది.

అతను బిమలని అదేపనిగా చూస్తున్నాడు!! "మాకంటె అదృష్టవంతులు మీరు" అన్నట్టు. ఆమె నాజూకుతనానికి, అందానికి, చెప్పలేని ఆనందం అనుభవిస్తున్నాడు.

పక్కగా బెంగాలీ రొద కంకిరబింకిరిగా చెవుల్లో వొద్దన్నా పడుతోంది.

బిమలకేసి చూసాను ఏంచేస్తోందోనని. ఆమెపని అధ్వాన్నంగా వుంది. అసహ్యంగా వున్న అతని దృష్టిపథంలోంచి తప్పించుకుందుకు అష్టకష్టాలూ పడుతోంది. ఒకసారి సుదర్శనసేన్‌ని పలకరించపోయి ఊరుకుని, మళ్ళా ఏదో ఆలోచనలో పడింది. నాకు నవ్వు వచ్చింది ఆమె అవస్థ చూస్తుంటే.

తనకంటె అందమైన బ్రిటిష్ సోల్జరు తన్ని నిర్లక్ష్యం చెయ్యడం; తను, తనకంటె తక్కువ అందంకల జాతికి చెందిన నీగ్రోని నిర్లక్ష్యం చెయ్యడం. ఇవి చూస్తుంటే ఎప్పుడో ఓ మీటింగ్‌లో జె.ఆర్. చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి :

"మధ్యతరగతి ప్రజలు విప్లవం యెడల తమ దృక్పథాన్ని త్వరగా తేల్చుకోరు. తమకంటె అధికులైన పెట్టుబడిదారీ వర్గం కాళ్లు వొత్తడానికి చూస్తారు, తమకాళ్ళవద్ద పడుకున్న కార్మికవర్గంతో చేతులు కల్పడానికి నిరాకరిస్తూ" నని.

మధ్యతరగతి ప్రజల అవస్థలా వుంది, బిమల స్థితి చూస్తే.

అప్పుడే హుగ్లీ నదిని దాటాం. సుదర్శన్‌సేన్ బొటానికల్ గార్డెన్సు వుండేచోటు చూపిస్తున్నాడు. వొంతెన గడిచింది.

"ఇక్కడినుంచే జూకి వెళ్ళడం. దిగు" అన్నాడు సుదర్శన్.

దిగుతూ నీగ్రోని చూశాను. మధురస్వప్న మేదో ఏ సగంలోనో కరిగిపోయినట్టు వెలవెల బోతున్నాడు.

బిమల పెద్దగండం గడిచినట్టు నిట్టూరుస్తోంది.

ఇదంతా ఓ అరగంటలో జరిగిన సంగతి.

*19.05.1946*–ఆనందవాణి వారపత్రిక